PRGI NO: TGTEL/26/A1984

VISION PRABHA

# విజన్ ప్రభ

తెలుగు దినపత్రిక

Published from . హైదరాబాద్..నల్గొండ. సూర్యపేట. రంగారెడ్డి. విజయవాడ. గుంటూరు.

TGTEL/26/A1984 VISION PRABHA
విజన్ ప్రభ
తెలుగు దినపత్రిక
విజన్ ప్రభ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను
• ప్రాంతీయ వార్తలపై పట్టు మరియు ఆసక్తి ఉన్నవారికి ప్రాధాన్యత
• అనుభవం ఉన్నవారికి మెరుగైన అవకాశం
కావలసిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు:
98661 88619
96030 44841
*నియమనిబంధనలు వర్తిస్తాయి*

ఆదివారం ఏప్రిల్ 19, 2026 | ఎడిటర్. తూనం.వెంకటేశ్వర రావు. | సంపుటి:1 సంచిక:25 | పేజీలు 4 | వెల-2

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం



2లో

- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

**న్యూఢిల్లీ,ఏప్రిల్18 :**
మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు.

## మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

# బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం

- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం
- చిత్తశద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
- అందుకు ఇండి కూటమి బేషరతుగా మద్దతు ఇస్తుంది
- బిజెపితో జతకట్టిన పార్టీలకు ఎదరుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ,హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజన్ ప్రభ)**
మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు.



## తెలంగాణ ఆత్మగౌరవం

# దెబ్బతీసిన తేజస్వీసూర్య

### పెదవి విప్పని తెలంగాణ బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు

- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కెటిఆర్
- జగిత్యాలలో కెసిఆర్ ఆశీర్వాద సభ ఏర్పట్లు పరిశీలన



**జగిత్యాల,ఏప్రిల్18 :**
బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ లు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్‌రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ – పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాను పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు.

2లో..



# రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఆనందం

- దేశాన్ని విభజించే కుట్రలను ఆపారు
- వారందరికీ ఎన్నో కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా స్టాలిన్ వెల్లడి

**చెన్నై,ఏప్రిల్18 :**
లోక్‌సభలో శుక్రవారం రాజ్యాంగ 131 సవరణ బిల్లు 2026

2లో..




# రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

- 20న కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజన్ ప్రభ)**
తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా'పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది.

# భూముల మార్కెట్ విలువ పెంచే ప్రతిపాదన

## • రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజన్ ప్రభ)**
త్వరలోనే భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు భూముల ధరల పెంపు జరగలేదని, త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.



మిగతాది 2లో

## పులి బయటకు వస్తే..

# ఎన్ని మేకలన మింగిందో చెబుతాం

- ఎన్ని ఆవులను తిన్నదో బయటపెడతాం
- కెసిఆర్ జగిత్యాల సభపై పిసిసి చీఫ్ సెటైర్లు



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజన్ ప్రభ)**
పులి బయటకు వస్తే సంగతి చెబుతామని పరోక్షంగా కెసిఆర్ ను ఉద్దేశించి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. పులి ఎన్ని మేకలు తిన్నదో చెబుతామని.. పులి ఎన్ని ఆవులను మింగిందో చెబుతామని పేర్కొన్నారు. పులి ఆసరా తీసుకొని ఎన్ని పిల్లులు లాభపడ్డాయో బయటపెడుతామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాలలో పాల్గొననున్న మీటింగ్‌పై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పులి ఏం చేసిందో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన అన్ని విషయాలు బయటపెడతామని హెచ్చరించారు.

మిగతాద్ది 2 లో




# 'యువత వ్యవసాయంపై దృష్టి పెట్టాలి'

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- ఐసీఏఆర్--ఐఏఆర్ఐ' డైరెక్టర్ డా. సీహెచ్ శ్రీనివాసరావుకు 'స్వామి నాథన్ అవార్డు' ప్రదానం
- శ్రీనివాస్‌రావుకు అవార్డు అందజేయడం ఆనందంగా ఉంది

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజన్ ప్రభ)**
హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ పేరుతో ఏర్పాటు చేసిన ప్రతిభ పురస్కారాన్ని వ్యవసాయ రంగంలో విశేష సేవలందించిన 'ఐసీఏఆర్--ఐఏఆర్ఐ ' డైరెక్టర్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావుకు అందజేయడం ఆనందంగా ఉందని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. రిటైర్డ్ ఐసీఏఆర్ ఉద్యోగుల సంఘం, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ సంయుక్తంగా 2024--25 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక 9వ 'ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్ అవార్డు' పంపిణీ కార్యక్రమం శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎం. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ చైర్మన్ మండవ ప్రభాకరరావు,

మిగతాది 2లో

## కాంగ్రెస్‌కు ఉద్యోగుల

# ఉసురు తప్పదు

- ఉద్యోగుల జీతభత్యలు సకాలంలో ఇవ్వడం లేదు
- పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు
- ఐదు డిఎలు పెండింగ్‌లోనే ఉన్నాయి
- ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజన్ ప్రభ)**
తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత , జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



మిగతాది 2లో

# మహిళల హక్కులను విపక్షాలు కాలరాశాయి: లక్ష్మణ్




**హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజన్ ప్రభ)**
రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాల రాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు.



2లో..

# తెలంగాణలో భానుడి భగ భగ..

## కుమురంభీం జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (విజన్ ప్రభ)**
తెలంగాణలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన ప్రజలు ఎండవేడిమి తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు. శనివారం కుమురంభీం జిల్లా కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి

మొదటి పేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకో వాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెప్పుకొచ్చారు. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌కు ఉద్యోగుల ఉసురు తప్పదు

మొదటి పేజీ తరువాయి

ఉద్యోగులు,ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఎలు పెండింగ్‌లో ఉన్నాయని,సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు.ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమిషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

## మహిళలకు విపక్షాలు వ్యతిరేకం

మొదటి పేజీ తరువాయి

ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298-230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

## రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. బటన్ నొక్కి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేయనున్నారు. రెండో విడత నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని మెజారిటీ రైతులకు లబ్ది చేకూరనుంది. ప్రతి ఎకరానికి రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. ఈ విడతలో 45,11,947 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు ఈ సాయం వర్తించనుంది. ప్రభుత్వం రైతు భరోసా కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. దీనికి సంబంధించిన గణాంకాలు కింది విధంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో సక్సెస్‌ఫుల్‌గా జమ చేసింది. 20వ తేదీన రూ. 5,653 కోట్లు జమ కానున్నాయి. మొత్తం 73 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. మిగిలిన రైతుల కోసం మూడో విడత నిధులను విడుదల చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది.

విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఈ నగదు అందడం వల్ల రైతన్నలకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుంది. నిధులు సకాలంలో అందడం వల్ల అన్నదాతలు సాగు పనులను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రాధాన్యం ఇస్తోంది. కాటారం సభ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

## మహిళల హక్కులను విపక్షాలు కాలరాశాయి: లక్ష్మణ్

మొదటి పేజీ తరువాయి

శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. " మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు" అని లక్ష్మణ్ అన్నారు.

## తెలంగాణలో భానుడి భగ భగ.. కుమురంభీం జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత

మొదటి పేజీ తరువాయి

నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది.

**తెలంగాణలో ఈ నెల 26 వరకు వర్షాలు**

రాష్ట్రంలో ఓ వైపు ఎండల తీవ్రత ఉన్నప్పటికీ మరికొన్ని ప్రాంతాల్లో వర్షసూచన ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఉపరితల అవర్తనం, ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఈ నెల 26 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఇవాళ జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన ఉందన్నారు. వర్షం కురిసే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## భూముల మార్కెట్ విలువ పెంచే ప్రతిపాదన

మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు.ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను 'భూ-భారతి' ద్వారా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ, భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. సమ్మర్ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. అసైన్డ్ భూములపై వచ్చిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు రకాల ఫిర్యాదులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని, శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పుడు ఇతర మంత్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రతిపక్షం ట్రాప్‌లో పడకుండా ఓపికగా సమాధానాలు ఇచ్చానని అన్నారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై లిస్ట్ తయారు అవుతోందని, సరైన సమయంలో అన్ని విషయాలు బయటకు వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## 'యువత వ్యవసాయంపై దృష్టి పెట్టాలి'

మొదటి పేజీ తరువాయి

రిటైర్డ్ ఐసీఏఆర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ రావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా ఎంఎస్ స్వామినాథన్ ప్రతిభా పురస్కారాన్ని వెంకయ్యనాయుడు.. డాక్టర్ శ్రీనివాసరావుకి ప్రదానం చేసి సత్కరించారు.

ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. వ్యవసాయం, పర్యావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని దేశానికి అవసరమైన విధానాలను రూపొందించడంలో శ్రీనివాస్‌రావు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ దేశానికి మార్గదర్శకత్వం వహిస్తున్నందుకు ఈ పురస్కారం దక్కిందన్నారు. ప్రతిభకు గౌరవం ఇవ్వడం ద్వారా సమాజానికి ప్రేరణ కలుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో మండవ వెంకటరామయ్య చేసిన కృషిని స్మరించుకుంటూ, ఆయన స్థాపించిన విత్తన సంస్థను ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు.

వ్యవసాయం దేశ భవిష్యత్తుకు కీలకమని, యువత ఈ రంగంపై దృష్టి సారించాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ప్రకృతిని పరిరక్షించుకోవడం, పశుసంపదను కాపాడుకోవడం అవసరమని సూచించారు. వ్యవసాయం ల్యాబ్‌లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి చేరాలని, శాస్త్రవేత్తల పరిశోధనలు రైతులకు అందాల్సిన అవసరం ఉందన్నారు. భూసార పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, రసాయన ఎరువుల అధిక వినియోగం భూమి నాణ్యతను దెబ్బతీస్తుందని హెచ్చరించారు.

అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భారత గ్రీన్ రివల్యూషన్ శిల్పి ప్రొఫెసర్ స్వామినాథన్ జన్మ శతాబ్ది సందర్భంగా శ్రీనివాసరావుకు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. భారత వ్యవసాయాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టడంలో ఎంఎస్ స్వామినాథన్ గారి పాత్ర గొప్పదని ఈ సందర్భంగా చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తల కృషి సాధారణ రైతులకు పూర్తిగా చేరడం లేదని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో భూమిని పరిరక్షించకపోతే గ్రీన్ రివల్యూషన్ ఫలితాలు ప్రతికూలమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నవారిని ప్రోత్సహించాలని, మంచి కార్యక్రమాలను కొనసాగించాలని మండవ ప్రభాకర్ రావును కోరారు.

వ్యవసాయానికి సేవ చేసిన వారికి గౌరవం దక్కుతుందని, క్లైమేట్ మార్పులకు తట్టుకునే వ్యవసాయం, సహజ వనరుల నిర్వహణలో డాక్టర్ శ్రీనివాసరావు చేసిన విశేష కృషికి ఈ అవార్డు లభించిందని నూజివీడు సీడ్స్ లిమిటెడ్ చైర్మన్ మండవ ప్రభాకరరావు అన్నారు. ఆయన దేశ వ్యాప్తంగా లక్షల హెక్టార్లలో వనరుల సంరక్షణ సాంకేతికతలను విస్తరించడం, జిల్లా స్థాయి కంటింజెన్సీ ప్రణాళికలను రూపొందించడం ద్వారా వ్యవసాయ స్థిరత్వం, ప్రతిఘటన సామర్థ్యాన్ని గణనీయంగా పెంచినట్లు తెలిపారు.

## పులి బయటకు వస్తే.. ఎన్ని మేకలన మింగిందో చెబుతాం

మొదటి పేజీ తరువాయి

శనివారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాత్రనే లేదని మహేశ్ గౌడ్ విమర్శలు చేశారు. బీజేపీ ఎంపీలు యాక్సిడెంటల్ లీడర్స్ అని ఆక్షేపించారు. మతాల మధ్య చిచ్చు, కులాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు ఏం తెలియదని సెటైర్లు గుప్పించారు. కర్ణాటక ఎంపీ తెలంగాణను కించపరిస్తే రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిద్రపోయారా..? అని ధ్వజమెత్తారు. నలభై ఏళ్లలో కిషన్‌రెడ్డి ఒక్క బీసీ నాయకుడినైనా తయారు చేశారా..? అని ప్రశ్నించారు.మహిళా సాధికారతపై కాంగ్రెస్, బీజేపీకి చాలా తేడా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తొలి మహిళా ప్రధాని, రాష్ట్రపతిని చేసింది కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. సోమవారం మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని.. కానీ ఈ బిల్లు ముసుగులో మోదీ ప్రభుత్వం డీ లిమిటేషన్ చేయాలనే ప్రయత్నం చేసిందని ఆగ్రహించారు. అక్రమంగా బిల్లును పాస్ చేయాలని కుట్ర చేశారని ఆరోపించారు. ఈ బిల్లు వీగిపోవడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చెంపపెట్టు లాంటిదని విమర్శించారు. అహంకారంతో ఉంటామంటే నిన్నటిలా జరుగుతుందని అన్నారు. ఉత్తర భారతదేశానికి ఎక్కువ సీట్లు ఇచ్చే ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని చెప్పుకొచ్చారు. బీజేపీ నియంతృత్వ పోకడకు చెక్ పడిందన్నారు. ఈ బిల్లు వీగిపోవాలనే డీ లిమిటేషన్‌తో ముడిపెట్టారని తెలిపారు. తెలంగాణలో రెడ్డి ముఖ్యమంత్రి బీసీ కుల గణన చేశారని పేర్కొన్నారు. కిషన్‌రెడ్డికి మహేశ్ కుమార్ గౌడ్ సవాలు విసిరారు. జై శ్రీరామ్ అనకుండా కిషన్‌రెడ్డి గెలవగలరా..? అని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తే మిషన్ రెడ్డికి శ్రీరాముడు కావాలని విమర్శించారు. జై శ్రీరామ్ అనకుండా తాను చేసిన అభివృద్ధిపై ప్రచారం చేసి కిషన్‌రెడ్డి గెలవగలరా..? అని నిలదీశారు. జై శ్రీరామ్ అనకుంటే బీజేపీకి మనుగడ లేదని అన్నారు. దేవుడి పేరు చెబితే ఓట్లు రాలే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తేజస్వీ చిన్న పిల్లోడని మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. తేజస్వీ దేవుడి పేరు చెప్పుకొని గెలిచిన వారని విమర్శించారు. ఆయన యాక్సిడెంటల్‌గా ఎంపీ అయ్యారని ఎద్దేవా చేశారు. కర్ణాటక గురించే తేజస్వికి ఏమాత్రం తెలియదని అన్నారు. తెలంగాణ గురించి తేజస్వికి ఏం తెలుసని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లను బీసీలకు ఇచ్చామని స్పష్టం చేశారు. మనువాద బీజేపీకి మహిళలకు గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అత్యధికంగా మహిళా నాయకులను తయారు చేసింది కాంగ్రెస్ అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఆనందం

మొదటి పేజీ తరువాయి

దీంతో నల్లచట్టమైన డీలిమిటేషన్‌ని కేంద్రం ఉపసంహరించుకుంది. డీలిమిటషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేసిన పోరాటం పార్లమెంటులో విజయం సాధించిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. దానిని ఓడించినందుకు ఇండియా బ్లాక్ ఎంపీలకు, మహిళలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియో పోస్టు చేశారు. నేను ఆనందంతో, నూతన శక్తితో మీ ముందు నిలబడ్డాను. డీలిమిటేషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా మన పోరాటం విజయవంతమైంది. ఈ ప్రమాదాన్ని ఏడాది క్రితమే ఊహించి, ఈ విజయాన్ని సాధించడానికి అవసరమైన పనులన్నీ అప్పుడే మొదలుపెట్టాము. మొదట ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకుల సమన్వయ సమావేశంతో మొదలుపెట్టి, మొన్న మేము నల్లజెండా ఎగురవేసి నల్లచట్టం ప్రతిని దహనం చేశాము. అప్పుడు నేను దహనం చేసిన ప్రతిల మంటను వ్యాపించనివ్వండి అని నేను అన్నాను. అదే నిన్న పార్లమెంటులో కూడా మంటలు చెలరేగాయి' అని స్టాలిన్ వీడియోలో అన్నారు. హిళా రిజర్వేషన్ల నెపంతో మోసపూరిత ప్రయతాన్ని ప్రతిఘటించిన తమిళనాడు ప్రజలకు, ముఖ్యంగా మహిళలను ఆయన ప్రశంసించారు. అలాగే శుక్రవారం పార్లమెంటులో 50,60 వ దశకాల నాటి పాత డిఎంకెని చూడడం అంటే ఏమిటని అడుగున్న కొంతమంది అపరిపక్వ వ్యక్తులతో 'ఇదే డిఎంకె' చూడండి' అని నేను చెప్పాను. నిన్న మేమ దాన్ని బలంగా చూపించాం అని స్టాలిన్ వీడియో సందేశంలో అన్నారు. పార్లమెంటులో దీనిని ఓడించిన ప్రతి ఒక్కరికీ తాను కతృతజ్ఞతలు తెలిపారు. ఇండియా బ్లాక్ పార్టీలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఏకతాటిపై నిలబడటం వల్లే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. దేశాన్ని విభజించే ప్రయత్నాల కు ఇది భారీ దెబ్బ అని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రతిపక్ష పార్టీల మధ్య పెరుగుతున్న ఐక్యతను ప్రదర్శిస్తోందని ఆయన తెలిపారు. ఇది మోడీ ప్రభుత్వానికి ఆరంభం మాత్రమే. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 12 ఏళ్లలో తొలిసారిగా పార్లమెంటులో వీగిపోయిందని ఆయన ఎత్తిచూపారు. ప్రతిపక్ష పార్టీల సభ్యులకు ఈ సందర్భం స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

మొదటి పేజీ తరువాయి

ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పునారేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడి గడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్‌లో చిన్న అనుకున్న. కానీ రేవంత్‌ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

# 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

**•తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,**





ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాలలో, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని 102 ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ గురుకులాలలో, వసతి గృహాలలో వంటగది, పారిశుధ్యం, మరమ్మత్తు పనులు చేపడుతామని, విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని, స్కిల్ డెవలప్మెంట్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని, రైతుల రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**





వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వేంపల్లి లో గల జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి మంచిర్యాల జిల్లా రవాణా అధికారి సిహెచ్. రంజిత్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఆటో, లారీల డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో దాదాపు 200 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు, కంటి అద్దాలు అందించడం జరిగిందని తెలిపారు. రోడ్లపై ప్రయాణించే సమయంలో రక్షణ ముఖ్యమని, ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో వేగ పరిమితి అనుసరించాలని, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని తెలిపారు. ప్రజల రక్షణలో భాగంగా వాహనదారులు ఎలాంటి కంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, వాహనాలు నడిపే వారికి కంటిచూపు అత్యవసరమని, కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో అవసరం ఉన్నవారికి శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. జిల్లాలో రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్ల చేయడం జరుగుతుందని, సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపి సమయంలో ఏకాగ్రతతో నడపాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, రాంగ్ రూట్ లో వాహనం నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పి.ఎం. అజయ్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి,

**•మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య,**






పి.ఎం.--అజయ్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శనివారం ప్రధానమంత్రి అజయ్ పథకంలో ఎంపికైన జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామపంచాయతీ లోని రొమ్మిపూర్ గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లు, వార్డు సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు. పి. చంద్రయ్య, మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల శుభ్రతపై చర్యలు తీసుకోవాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు అందిస్తున్న గుడ్లు, పాలు, పోషకాహారాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా పొందుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఎదగాలని, ప్రభుత్వ పథకాల అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అభిప్రాయాలను తెలుసుకుని, అందరూ పథకాల ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామాభివృద్ధి పనులు సమయానికి, నాణ్యతతో పూర్తి అయ్యేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గ్రామంలోని మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్వహణపై కిష్టాపూర్ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వెలిపించారు. అంతకుముందు కుందారం గ్రామాన్ని సందర్శించి ఉపాధి హామీ పథకం కింద వేతన కార్మికులు చేపడుతున్న పనులను పరిశీలించారు. కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలను సమీక్షించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా పొందుతున్న ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ గణపతి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యజమానిని సత్కరించిన మందడి శ్రీనివాసరావు



కూకట్పల్లి కే పి హెచ్ బి డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు 6వ ఫేస్ లోని అబ్దుల్ కలాం పార్కును శనివారం రోజున సందర్శించారు.. ఈ సందర్భంగా లక్ష్మీ గణపతి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఓనర్ పైలా గణేష్ పార్కులో ఉన్న ఓపెన్ జిమ్ మెయింటెనెన్స్ కొరకు లక్ష రూపాయల చెక్కును మందడి శ్రీనివాసరావు చేతుల మీదుగా అసోసియేషన్ సభ్యులకు విరాళంగా అందించడం జరిగింది.. ఈ సందర్భంగా మందడి శ్రీనివాసరావు వారిని శాలువాతో సత్కరించారు.. అనంతరం మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ. గత పది ఏళ్ల కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్ ని ఎంతో సుందరంగా తీర్చిదిద్దుకున్నామని.నాడు నిర్మించుకున్న పార్కులు తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడ అభివృద్ధి అన్న ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మించుకున్న పార్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని. అందుకు ముందుకు వచ్చిన గణేష్ కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వేసవి తాపానికి శాంతి చేకూర్చే చందనోత్సవం...
## 27న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవం



వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఈ నెల 27వ తేదీన శ్రీ వెంకటేశ్వర స్వామివారి చందనోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సంవత్సరంలో రెండుసార్లు మాత్రమే నిర్వహించే ఈ ప్రత్యేక ఉత్సవం, వేసవి తీవ్రతలో స్వామివారికి శీతలతను అందించేందుకు నిర్వహించే పవిత్ర సేవగా విశేష ప్రాధాన్యం పొందింది.

ఆలయ ప్రధాన అర్చకుడు ముడంబై వెంకట రమణాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం 6 గంటలకు ప్రాభాత ఆరాధనతో కార్యక్రమాలు ప్రారంభమై, బాలభోగం నిర్వహించబడుతుంది. అనంతరం ఉదయం 7 గంటలకు విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధనం, కళశారాధన నిర్వహించబడతాయి.

తదుపరి 108 లీటర్ల ఆవుపాలు, 108 కళశాలతో పంచామృతం, పుష్పాలు, ఫలరసాలు, పండ్లు మరియు ఉత్తరప్రదేశ్ నుండి ప్రత్యేకంగా సమర్పించే సుగంధ జలాలతో స్వామివారికి మహాభిషేకం ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం కుంభసంప్రోక్షణ జరిపి, చందన కాపు సేవను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

ఈ పవిత్ర ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ఈవో ఏ.బి. రవీంద్రారెడ్డి మరియు నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# మైనర్ బాలికతో వెట్టిచాకిరీ చేయిస్తున్న వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

**సామాజిక కార్యకర్త కొల్లు సుబ్బారావు**



**సూర్యాపేట జిల్లా ఏప్రిల్ 18 ( విజన్ ప్రభ )**

అనంతగిరి మండలం పాలవరం గ్రామంలో 7 సంవత్సరాల బాలికతో బాతులను కాయిస్తూ వెట్టిచాకిరీ చేయిస్తూ వేదిస్తున్న వ్యక్తిని కఠినంగా శిక్షించాలని అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కొల్లు సుబ్బారావు ఒక ప్రకటనలో అన్నారు

నేడు మండల కేంద్రం అనంతగిరిలో మాట్లాడుతూ చదువుకోవాల్సిన వయస్సులో బాతులు కాయిస్తూ కొడుతూ తిడుతూ బాలికను వేదించడం దారుణమని అన్నారు అలాంటి వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు

## బడిబాటతో ప్రభుత్వ పాఠశాలల వైపు అడుగులు

**సూర్యాపేట జిల్లా ఏప్రిల్ 18 ( విజన్ ప్రభ )**



అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచే లక్ష్యంతో అమీనాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో పర్యటించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులను ప్రత్యక్షంగా కలుసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు.గ్రామ పరిధిలో ఇంటింటికీ వెళ్లిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను వివరించారు. అదనంగా పాఠశాలల్లో అమలు చేస్తున్న ఇంగ్లీష్ మీడియం బోధన, డిజిటల్ తరగతులు, నాణ్యమైన విద్యా విధానాల గురించి తల్లిదండ్రులకు సమగ్రంగా తెలియజేశారు.ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని, ప్రతి తల్లిదండ్రి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ బడిబాట ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు పీ ఏ సి ఎస్ మాజీ వైస్ చైర్మన్ చిలకమూడి శ్రీనివాసరావు. బాది శీను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎక్లాస్‌ఖాన్ పేట తండాలో కొత్త ఎల్.టి స్తంభాల ఏర్పాటు

**సూర్యాపేట జిల్లా ఏప్రిల్ 18 ( విజన్ ప్రభ )**



:నడిగూడెం మండల పరిధిలోని ఏ క్లాస్ కాన్ పేట తండా తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యుత్ శాఖ నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమం ద్వారా ఎక్లాస్‌ఖాన్ పేట తండా గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామంలో లూజ్‌గా ఉన్న మరియు విరిగిపోయిన ఎల్.టి లైన్ స్తంభాలను గుర్తించి, వాటి స్థానాల్లో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ధారావత్ వరలక్ష్మి డా. వెంకట రమణ మాట్లాడుతూ, గ్రామంలో విద్యుత్ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్న మునగాల డివిజన్ ఏడీఈ రామ్‌నాయక్ కి, నడిగూడెం డివిజన్ ఏఈ ) గణేష్ కి, ఎక్లాస్‌ఖాన్ పేట క్లస్టర్ స్థాయి జూనియర్ లైన్‌మెన్ రాంబాబు కి మరియు విద్యుత్ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జూనియర్ లైన్‌మెన్ రాంబాబు , వార్డు సభ్యులు ధారావత్ అమ్రు , మధార్ , వాంకడోతు సుక్య , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మంతోనే లోక కల్యాణం

**సూర్యాపేట జిల్లా ఏప్రిల్ 18 ( విజన్ ప్రభ )**






కోదాడ టౌన్ ఆర్ ఎస్ వి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం..

లోక కల్యాణం కోసం ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలని బలుసుపాడు గురుదమ్ ఆశ్రమం స్థాపకులు గంటెల వెంకటరమణ అన్నారు.శనివారం కోదాడ పట్టణం అర్ స్ వి ఫంక్షన్ హాల్ లో హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు డాక్టర్ జూకూరి సంజీవ్ కుమార్ అధ్యక్షతన జరిగిన హిందూ సమ్మేళనానికి ఆయన హాజరై భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. కులం అనే సంకెళ్లను తెంచుకొని, మానవీయ కోణంలో హిందువులంతా ఒక్కటిగా ముందుకు సాగాలన్నారు. ఒకరికొకరు తోడ్పడుతూ మంచిని సమాజానికి పంచాలని సూచించారు. ఐక్యమత్యమే మహాబలమని, ధర్మ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.సనాతన ధర్మ సూత్రాలను పాటిస్తూ సమాజ హితం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భేరి సునీత రెడ్డి, ఆర్ఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర సహకార్యవాహ ఎర్ర నర్సింగ్, కన్వీనర్ ఆవుల రంగారావు, గౌరవ అధ్యక్షులు గుండపునేని పద్మావతి నాగేశ్వరరావు కొత్త రామారావు, బస్వోజు పుల్లయ్య చారి, కాజులూరి రామకృష్ణ, అక్కిరాజు యశ్వంత్, రణబోతు వెంకటరెడ్డి, సంఘపు సాయికిరణ్, చల్లా లక్ష్మీనారాయణ, గోధుమల హనుమాచారి తదితరులు పాల్గొన్నారు...

## శౌర్యువ్ దర్శకత్వంలో ....విజయ్ కొత్త ప్రాజెక్ట్

ఇప్పటికే రెండు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విజయ్ దేవరకొండ.. శౌర్యువ్ దర్శకత్వంలో నటించే అవకాశాలున్నాయంటూ ఇటీవల ప్రచారం జరిగింది. దానిపై శనివారం అధికారిక ప్రకటన వెలువడింది. శౌర్యువ్‌తో సినిమాని ప్రకటిస్తూ.. విజయ్ షేర్ చేసిన పోస్టర్ ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ పోస్టర్‌తో మూవీ టీమ్‌ని పరిచయం చేశారు. జంతువులు, ఆయుధాలను హైలైట్ చేయడంతో ఇది వైలెంట్ మూవీ అని అర్థమవుతోంది. 'ఈ కోపమంతా ఒకప్పుడు ప్రేమే' అనే క్యాప్షన్ బట్టి.. ప్రేమలో విఫలమైన ఓ యువకుడి కథగా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్టు తెలుస్తోంది. 'హాయ్ నాన్న'తో తొలి ప్రయత్నంలోనే మెప్పించిన దర్శకుడు శౌర్యువ్. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంతో విజయం అందుకున్న ఆయన.. ఇప్పుడు యాక్షన్‌కు ప్రాధాన్యం ఇచ్చినట్లు పోస్టర్‌ని చూస్తే తెలుస్తోంది. వర్కింగ్ టైటిల్‌తో త్వరలో ప్రారంభం కానున్న ఈ సినిమాకి హేషబ్ అబ్దుల్ సంగీత దర్శకుడు. హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ అలెజండ్రో మార్టినెజ్ ఈ చిత్రానికి వర్క్ చేయనుండటం విశేషం. హీరోయిన్ వివరాలు ఇంకా ప్రకటించలేదు. రాహుల్ సాంకృత్యాన్ డైరెక్షన్‌లో 'రణబాలి'లో నటిస్తున్నారు విజయ్. ఇదొక పీరియాడికల్ యాక్షన్ మూవీ. రష్మిక హీరోయిన్. ఈ చిత్రం సెప్టెంబరు 11న విడుదల కానుంది. మరోవైపు, రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్దన'లో విజయ్ నటిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో కీర్తి సురేశ్ హీరోయిన్.




## బాలయ్యతో కొరటాల శివ మూవీ





ప్రస్తుతం కొరటాల శివ ఫోకస్ అంతా 'దేవర' సీక్వెల్ పైనే ఉందని అందరూ అనుకున్నారు. కానీ ఎన్టీఆర్ బిజీగా ఉండడంతో కుదరడం లేదు. ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయి 'దేవర-2' మొదలవ్వడానికి కనీసం ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం పట్టేలా ఉంది. ఈ ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా, కొరటాల ఒక పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇప్పటికే ఈ కథను బాలయ్యకు వినిపించడం, దానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం కూడా జరిగిపోయాయని సమాచారం. అయితే నందమూరి అభిమానుల్లో మెదులుతున్న ప్రశ్న ఏంటంటే.. దేవర 2 కంటే ముందే ఈ సినిమా ఉంటుందా అంటే అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. ఎన్టీఆర్ డేట్స్ దొరికే వరకు వేచి చూడకుండా, బాలయ్యతో ఒక సెన్సేషనల్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని కొరటాల భావిస్తున్నారు. ఇది టాలీవుడ్ వరకు పరిమితమవుతుందా లేక పాన్ ఇండియా రేంజ్‌లో ఉంటుందా అనే క్లారిటీ రావాల్సి ఉంది. అయితే బాలయ్య క్రేజ్ ఇప్పుడు నేషనల్ లెవల్‌లో ఉంది కాబట్టి, ఇది భారీ లెవల్‌లోనే ఉండే అవకాశం ఉంది.బాలయ్య లైనప్ చూస్తుంటే ఫ్యాన్స్‌కు పూనకాలు రావడం ఖాయం. ఇప్పటికే గోపీచంద్ మలినేనితో ఒక సినిమా పట్టాలెక్కనుంది. అలాగే వివేక్ ఆత్రేయ, క్రిష్ వంటి దర్శకులతో సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. ఈ గ్యాప్‌లో కొరటాల శివ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుంది..? ఒకవేళ ఈ సినిమా గనుక మొదలైతే, కొరటాల శివ దర్శకత్వంలో చేయబోయే దేవర-2 మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందా అనేది తెలియాల్సి ఉంది. బాలయ్య మార్క్ యాక్షన్.. కొరటాల మార్క్ సోషల్ మెసేజ్ కలిసి బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయో చూడాలి. మరి ఎన్టీఆర్ కంటే ముందే కొరటాల బాలయ్య సినిమాను పూర్తి చేస్తారా..? ఈ సినిమా పై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుంది..? అనే విషయాలు తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. మన బాలయ్య ఊపు చూస్తుంటే ఏదైనా సాధ్యమే అనిపిస్తోంది.

## వారణాసి కోసం పాట చిత్రీకరణ

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'వారణాసి'. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.

## మెగా ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..
## 'పెద్ది' కొత్త రిలీజ్ డేట్ లాక్.. ఎప్పుడంటే?


గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది' పై అభిమానుల అంచనాలు అన్నీ ఇన్నీ కావు. థియేటర్లలోకి ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న ఈ మూవీ రిలీజ్ ఇప్పటికే పలుమార్లు వాయిదా పడటంతో ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురిచేసింది. అయితే లేటెస్ట్ గా మరో కొత్త డేట్ ఫిక్స్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది.

**- ఇప్పటికే రెండు సార్లు వాయిదా..**

నిజానికి 'పెద్ది' సినిమాను తొలుత రామ్ చరణ్ పుట్టిన రోజు సందర్భంగా మార్చి 27న రిలీజ్ చేయాలని భావించారు. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో దానిని ఏప్రిల్ 30 వతేదీ వాయిదా వేశారు. దీంతో అభిమానులు ఫుల్ ఖుషి అవుతున్న సమయంలో మరో సారి ఈ సినిమాను వాయిదా వేస్తూ మేకర్స్ ప్రకటించి షాక్ ఇచ్చారు. దీంతో ఫ్యాన్స్ తో తీవ్ర నిరాశ మిగిల్చారు. ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్స్, టీజర్ ఈ మూవీపై అంచనాలను అమాంతం పెంచాయి. కానీ విడుదలలోనే తీవ్ర నిరాశను మిగుల్చుతుందన్న అభిప్రాయం ఫ్యాన్స్ లో వ్యక్తం అవుతోంది.

**- ఈ సారి పక్కానా?**

'పెద్ది' సినిమా షూటింగ్ , పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా విడుదలను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ఇటీవల అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను జూన్ 2026లో విడుదల చేస్తామని డేట్ చెప్పకుండానే సస్పెన్స్ లో ఉంచారు. అయితే సినీ వర్గాల




సమాచారం ప్రకారం జూన్ 4, 2026న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా విడుదలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ చిత్రం థియేట్రికల్ విడుదలతో పాటు పోస్ట్ థియేట్రికల్ డిల్స్ కూడా కీలకం. ప్రముఖ ఓటీటీ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ తో ఇప్పటికే ఒప్పందాలు పూర్తయ్యాయి. జూన్ 4 విడుదల తేదీకి నెట్‌ఫ్లిక్స్‌తో సహా కీలక భాగస్వాములందరూ ఆమోదం తెలిపినట్లు సమాచారం. దీనివల్ల ఓటీటీ , థియేట్రికల్ రిలీజ్ మధ్య తగినంత సమయం ఉండేలా పక్కాగా ప్లాన్ చేశారు.

**- భారీ అంచనాలతో..**

ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తుంది. వీరిద్దరి కెమిస్ట్రీ వెండితెరపై ఎలా ఉండబోతుందా అని ఆడియన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు . కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ , బోమన్ ఇరానీ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని అనుకున్నట్లు జరిగితే, అతి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. ఆ వెంటనే చిత్ర బృందం భారీ స్థాయిలో ప్రమోషన్స్ ప్రారంభించనుంది. జూన్ నెలలో మెగా తుఫాను మొదలవ్వడం ఖాయంగా కనిపిస్తోంది సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## రిపబ్లిక్ డే వేళ ప్రేమయుద్ధం

'బ్రహ్మాస్త్ర'లో ప్రేమికులుగా కనిపించి ప్రేక్షకుల్ని అలరించిన రణ్‌బీర్ కపూర్, అలియా భట్‌లను మరోసారి జంటగా చూపించబోతున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ ముక్కోణపు ప్రేమకథను ప్రముఖ దర్శకనిర్మాత సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్నారు. 2025లోనే తెరపైకి రావాల్సిన ఈ చిత్రం కొన్ని కారణాలతో వాయిదా పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాను గణతంత్ర దినోత్సవం సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 21న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది చిత్రబృందం. ప్రేమ, నమ్మకం, యుద్ధం.. లాంటి అంశాల మేళవింపుగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 'ఆల్ఫా' చిత్రంతో అలియా, 'రామాయణ'తో రణ్‌బీర్ బిజీగా గడుపుతున్నారు.



## సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ శనివారం పట్టాలెక్కింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో 'లేడీ సూపర్ స్టార్' నయనతార కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో నటించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పాన్-ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ నెలనుంచే షూటింగ్ మొదలవుతుందని గతంలోనే ప్రకటించిన చిత్ర బృందం, ఈరోజు నుంచి కెమెరా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించింది. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలయికగా రానున్న ఈ చిత్రం 2027 ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

